క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురంలో పునర్నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ పరిమి మంగతాయారు, బాబు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

ఆసుపత్రిలో తనిఖీలు

కిర్లంపూడి: రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్ఓ శాంతిప్రభ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో సమస్యలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్ బి.రాంబాబునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌పై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. టి.సాయి హేమాంజలి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్ కార్మికులకు ఉపాధి చూపాలి

ప్రత్తిపాడు: ఫ్లెక్సీ ప్రింటింగ్ నిషేధానికి ముందు నిర్వాహకులు, కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఫ్లెక్సీల నిషేధం విధిస్తూ ఈ నెల 26 నుంచి జీఓ నంబర్ 65ను అమలులోకి తెస్తుందన్నారు. ఈ జీఓ వల్ల ఫ్లెక్సీ ప్రింటింగ్ పనులు నిలిచిపోతాయన్నారు. దీని వల్ల ఫ్లెక్సీ నిర్వాహకులు, కార్మికులు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయంగా ఉపాధి మార్గాలను చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల ధర్నా

తుని/తునిరూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తుని రూరల్, అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు రమణమ్మ, కార్యదర్శి మేరీసమాధనం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గ్రాడ్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీఓ రమణకు వినతి పత్రం అందజేసి, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కోటనందూరు: విధి నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈఓపీఆర్డీ జి. అరుణ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక సచివాలయం-1ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటిపన్ను వసూలు, పారిశుధ్య నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. గడువులోగా 100 శాతం ఇంటిపన్ను వసూలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్లాస్టిక్, ఫ్లెక్సీల నిషేధంపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

భూముల రీసర్వే ప్రారంభం



సీతారాంపురంలో భూముల రీసర్వే చేస్తున్న అధికారులు

తొండంగి: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని సీతారాంపురంలో భూముల రీసర్వేను ప్రారంభించినట్టు మండల సర్వేయర్ నిరంజన్‌రావు బుధవారం తెలిపారు. గ్రామంలోని రైతుల భూములను డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్నామన్నారు. రైతులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, దస్తావేజు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్ జెరాక్స్‌లను వీఆర్వోకు అందజేయాలన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు



పాదురుపాకలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- పాండవులపాలెం, పాదురుపాక గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం



శంఖవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఇ.గోకవరం గ్రామ సచివాలయం పరిధిలోని పాండవులపాలెం, పాదురుపాక గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అన్నిక సత్తిబాబు, గొట్టిపల్లి చిన్నారావులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచులు గొనగాల అప్పలరాజు, దొడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీలు తటవర్తి రామన్న దొర, ఉమ్మిడి తాతీలు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు దోశే చిట్టిబాబు, మదినే నూకరాజు, పినిశెట్టి ప్రకాష్, లొండ బాబు, గుండాల వెంకటరత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక

శంఖవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో మండలంలోని కొంతంగి గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన మాజీ ఎంపీటీసీ పల్లా సత్యనారాయణ, బర్ల కొండబాబు, కిల్లాడి లోవరాజు, బుద్దాల సత్తిబాబు, గుమ్మిడి రాములు, కొర్ని శ్రీను తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు సాదరంగా ఆహ్వానించారు. ప్రతిఒక్కరూ కష్టపడి పని చేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూడల రామస్వామి, ఎంపీటీసీ నడిగట్ల నానాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పి నాయకంపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



పి.నాయకంపల్లిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని పి.నాయకంపల్లిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధుకుమార్, గండేపల్లి ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, మాజీ సర్పంచ్ ఉండవిల్లి జెమ్మి, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతికుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు విద్యుత్, తాగునీరు, డ్రైన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మలిరెడ్డి పాపారావు, జ్యోతుల రామస్వామి, సానేపిని చౌదరి, తాళ్లూరి కృష్ణ, ఎంపీడీఓ రామన్, ఈఓపీఆర్డీ వీఎస్ఎన్ మూర్తి, తహసీల్దార్ చిన్నారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కోటనందూరు హైస్కూల్ హెచ్‌ఎంకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. స్టడీ మెటీరియల్ సహాయంతో పబ్లిక్ పరీక్షలను సన్నద్ధం అయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. మండలంలో 195 మంది తెలుగు మీడియం, 285 మంది ఇంగ్లిషు మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. పీఏసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి శివలింగం ప్రతిష్ఠ మహోత్సవాలు

తుని రూరల్: చేపూరులో నిర్మించిన పరివార ప్రయుక్త ఉమారామలింగేశ్వరస్వామి వారి యంత్ర శిఖర ధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవాలను నెల 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయన్నారు. 26న గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి ప్రజ్వలన, అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హోమాలు, ధ్వజారోహణ, 27న వాస్తుపూజ, వాస్తు హోమం, లక్షణోద్ధారణ, క్షీరాభిషేకం, జలాధివాసం, ధాన్యాధివాసం, దీక్షా కళాహోమాలు, 28న బింబ, శిఖర, యంత్ర, ధ్వజ, శివలింగ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయని వివరించారు.

నేడు కొండరాజులబాబు జాతర

ఏలేశ్వరం: రమణయ్యపేటలో భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొండరాజులబాబు జాతర మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఏజెన్సీ ప్రాంతం నుంచి వందలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకూ ప్రతి శుక్రవారం గ్రామంలో భక్తులు పండగలు చేస్తారు. కాగా జాతరలో వేట్లపాలెం వారితో కోయడ్యాన్స్, డప్పుల మేళం, కోనారి చువార డ్యాన్స్, మ్యూజిక్ బ్యాండ్, లక్కగుర్రాలు, కొమ్ము లాట, వెలుగుబందవారితో గరగ నృత్యా, రమణయ్యపేట యూత్ వారితో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

ఏలేశ్వరం: బీహార్‌లోని పాట్నాలో ఫిబ్రవరి 15 నుంచి 20 వరకూ నిర్వహించే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. ఈ మేరకు మండలంలోని పరిమి తడకలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న అరాచక పాలనను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో ధరలు పెరిగి ఆర్థిక సంక్షోభం నెలకొందన్నారు. లిబరేషన్ జాతీయ మహాసభల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రశేఖర్, రెల్లి దారకొండ, వంతల పండుదొర, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాండవులపాలెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై పాఠశాల హెచ్‌ఎం బేబీని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రహరీ, పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామ ని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్న, రేఖ శ్రీను, బొడ్డు సతీష్, పినిశెట్టి ప్రకాష్, దేవ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ఏలేశ్వరం: పట్టణంలోని ఏలేరు నది వద్ద వచ్చే నెల 18న మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను బుధవారం వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. బ్రహ్మణరేవును పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చలమయ్య తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు, డేగల వెంకటరమణ, వాగు బలరామ్, యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ, మసిరపు నాగేశ్వరరావు, పైల శ్రీధర్, బత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హైవేపై రాస్తారోకో

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామస్తులు బుధవారం సాయింత్రం హైవేపై రాస్తారోకో నిర్వహించారు. జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది జి.ప్రేమ్‌కుమార్, డి.ప్రసాద్ తోటి సిబ్బంది వివాహ వేడుక నిమిత్తం మోటార్ సైకిల్‌పై యర్రవరం వెళుతున్నారు. నీలాద్రిరావుపేట వచ్చే సరికి రోడ్డుపై నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న రోడ్ సేఫ్టీ సిబ్బంది స్థానికుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా హైవేపై విద్యుత్ దీపాలు వెలగపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి: మండలంలోని యర్రంపాలెం శివారులో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ బి.సూర్య అప్పారావు బుధవారం తెలిపారు. సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్టు చెప్పారు.

చురుగ్గా స్కేటింగ్ ట్రాక్ నిర్మాణం



తుని మున్సిపల్ పార్కులో స్కేటింగ్ ట్రాక్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

తుని: స్థానిక రాజారాజబాబు మున్సిపల్ పార్కులో స్కేటింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ట్రాక్ నిర్మాణానికి కాకినాడ ఎంపీ వంగా గీత రూ.40 లక్షలు మంజూరు చేశారు. వీటితో తొలిదశ పనులు దాదాపు పూర్తవుతున్నాయి. బుధవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా పనులను పరిశీలించారు. తుని పురపాలకసంఘం ఏర్పడి దశాబ్దాలు అవుతున్నా గత ప్రభుత్వాలు క్రీడాకారులను పట్టించుకోలేదు. స్కేటింగ్ ట్రాక్ సమస్యను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పార్కు అభివృద్ధికి రూ. కోటి నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపట్టిన స్కేటింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ప్రస్తుతం లైటింగ్, టైల్స్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెల నుంచి ప్రాక్టీస్ చేసేందుకు విద్యార్థులను అనుమతిస్తామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం: రహదారి భద్రతపై బుధవారం పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్సై విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఏలేశ్వరం నుంచి యర్రవరం వరకూ ర్యాలీ చేశారు. ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రమాదాల నివారణకు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడప రాదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు యువకులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



శ్రీచైతన్య స్కూల్‌లో స్పోర్ట్స్ డే సెలిబ్రేషన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. జగ్గంపేటలో శ్రీచైతన్య స్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్పోర్ట్స్ డే సెలిబ్రేషన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు క్రీడల ప్రాధాన్యతను వివరించారు. పలు పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టడీ మెటీరియల్ పంపిణీ

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తారని ఎంపీడీఓ హరికృష్ణ తెలిపారు.

వసంత పంచమి వేడుకలు



శ్రీప్రకాష్‌లో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో బుధవా రం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్ వీవీఎస్‌బి బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు చదువుల తల్లి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు వసంతి పంచమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు చక్కని జ్ఞాన సమపార్జన కలగాలని, సరస్వతీ దేవి దీవెనలు కటాక్షించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు
- సీనియర్ ఓటర్లకు సత్కారం



తునిలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్ఓ మనోరమ, కమిషనర్ ప్రసాదరాజు

ఏలేశ్వరం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

తుని: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కుని, అర్హత ఉన్న అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తుని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి మనోరమ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యత మనోరమ వివరించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కొత్తగా ఓటు పొందిన బాలికలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, తహసీల్దార్ బాల సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం నూకరత్నం పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: వాకపల్లిలో సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఓటుహక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కోటనందూరు: మండల పరిధిలోని గ్రామాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణ లో అధికారులు ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పోలింగు బూత్‌ల వద్ద ఓటర్లతో సమావేశాలు నిర్వహించి ఓటుహక్కు నమోదు, ప్రాధాన్యత, సరైన నాయకులను ఎన్నుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ కుమార్ పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ, హంసవరం, తేటగుంట, వి.కొత్తూరు, డి.పోలవరం, కేఓ మల్లవరం, వల్లూరు తదితర గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కుమ్మరిలోవలో ముగ్గుల పోటీలను తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం పరిశీలించారు. మహిళలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఎస్.అన్నవరంలో సీనియర్ ఓటర్లను వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, నాయకులు కుసనం దొరబాబు, కార్యదర్శి మధుశేఖర్ ఘనంగా సత్కరించారు.

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

ప్రత్తిపాడు: ఎన్నికల్లో రాజకీయ ప్రలోభావాలకు లొంగకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి కోరారు. స్థానిక వైఎస్సార్ కాంతి పథం కార్యాలయంలో సీనియర్ ఓటర్లు, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఆర్ఐ మర్రిపూడి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు బర్రే కోటేశ్వరరావు, వెంకటరమణలను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి, సబ్ ట్రెజరీ అధికారి సలీంఖాన్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కె.పద్మజ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

శంఖవరం: జి.కొత్తపల్లి, నెల్లిపూడి జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సరాల శ్రీను, ఈగల అప్పారావు, వీఆర్వోలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తహసీల్దార్ బి.శ్రీదేవి ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు.